కథ

## ఉమాదేవి

# మేలుకొలుపు

మానవుడి మనస్సు అద్భుతమైనది మాత్రమే కాదు విచిత్రమైనది కూడా! కొన్నివేల ధాతువుల రసాయనిక సమ్మేళనం లాంటిదట! కోరిన విధంగా రెప్పపాటు కాలంలో విశ్వదర్శనం చేయించనూగలదు. కోరికకు విరుద్ధంగా మొండికేసి మరచిపోదామనుకునే విషయాలను పదేపదే మనోఫలకంపై సాక్షాత్కరింపచేయనూగలదు!

శాంతి గూర్చి ఆలోచనల్ని మనసు పొరల్లోంచి పెకలించి పారేయాలనుకున్నా కుదరడం లేదు శంకరానికి. గోడకి కొట్టిన కందుకంలా తిరిగివచ్చి కళ్లఎదుట సాక్షాత్కరిస్తున్నాయి!

‘అమ్మ’లో మొదటక్షరం, ‘నాన్న’లో చివరి అక్షరం కలిపితే ‘అన్న’! అమ్మానాన్నలు లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించాడు. ఉహూ! విద్య మాత్రమే చెప్పించాడు. ‘బుద్ధి’ అనేది ఏ విద్యాలయంలోనూ, విపణిలోనూ లభ్యమయ్యే వస్తువు కాదు కదా! స్వతహాగా జనించాలి! అది జనించడానికి అనుకూల పరిస్థితులను తాను కలిగించగలిగాడనుకున్నాడు శంకరం. కానీ తన అంచనా తలక్రిందులై మనసుకి తీవ్రమైన అఘాతం కలిగింది.

రెక్కలొచ్చాక గూడు విడిచిపెట్టి పోయిన గువ్వలా పాతికేళ్ల అనుబంధాన్ని తెంచుకుని మరీ వెళ్లిపోయింది శాంతి, పుట్టెడు అశాంతి తమ ముందు కుమ్మరించి.

“ఏమిటీ? మీ శాంతి ఎవరో తక్కువ కులంవాడితో లేచిపోయిందట కదా!” ఎదురుపడ్డ ప్రతీ వ్యక్తీ తనతో ఇవే మాటలు వల్లెవేస్తాడేమోననే అనుమానమూ, భయంతో తల వంచుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు శంకరం, పరిచయం ఉన్నవారు ఎవరైనా ఎదురుపడితే. ఇలా ఆర్నెల్ల నుండీ ఈ తల వంపుల శిక్ష అనుభవిస్తూనే ఉన్నాడు. సన్నిహితంగా మెసలే ఒకరిద్దరు సహోద్యోగులు శంకరాన్ని ఓదార్చబోయారు.

“ఈ రోజుల్లో ఈ ప్రేమ వివాహాలు సాధారణమైపోయాయి శంకరం! ఎందుకంతలా మధనపడిపోతావ్? ఆ దంపతులిద్దర్నీ ఒక మంచిరోజు చూసి తీసుకొచ్చి ఓ విందు ఏర్పాటుచేసి నలుగురికీ పరిచయం చేసెయ్. పెద్ద మనసుతో క్షమించావని ఆ అమ్మాయి ఆనందిస్తుంది. చెల్లెల్ని అమితంగా అభిమానిస్తూండడం వలననే కదా ఇంతగా కుమిలిపోతున్నావు?! నీకు కూడా ఉపశమనం కలుగుతుంది.”

శంకరం మాత్రం వారి సాంత్వన వచనాలూ, సలహాలూ స్వీకరించలేకపోతున్నాడు. ఏ చిన్న పనైనా అన్నా వదినలతో చెప్పకుండా చెయ్యని శాంతి తనకి తానుగా అంత పెద్ద నిర్ణయం తీసుకోవడమూ, అతి స్వల్ప వ్యవధిలో దానిని ఆచరణలో పెట్టడమూ అతడిని కోలుకోలేని విధంగా కృంగదీశాయి.

శాంతి తలపులు క్రమక్రమంగా మసకబారుతుండగా ఆ ఉదయం ఫోనులో వచ్చిన వార్త పదేపదే గుర్తుకొస్తూ మనసులో తీవ్రమైన అలజడి సృష్టిస్తోంది.

* * *

“ఆ పాతిక వేలూ ఈరోజే పోస్టాఫీసులో జమ చెయ్యాలంటారా?” అన్నం వడ్డిస్తూ అడిగింది భార్య పద్మ.

“ఎన్నడూ ఆర్థిక వ్యవహారాల్లో తల దూర్చని మనిషి ఇప్పుడెందుకీ ప్రశ్న వేసిందీ?” అనే సందేహంతో భార్యను పరిశీలనగా చూశాడు. తన జవాబు కోసం ఎదురుచూస్తూ నిలబడింది ఎదుట.

“ఈ నెలలో జమ చేయకపోతే అదనంగా ఐదు వేలు రూపాయలు టాక్స్ కట్టుకోవాలి” అన్నం కలుపుకుంటూ అన్నాడు శంకరం.

కొన్ని క్షణాలు మౌనం వహించాక, “శాంతిని ఎంతో గారాబంగా పెంచామండీ...” అంది పద్మ.

“ఏం చేస్తాం? అయినా మనని కాదనుకుని ప్రేమించినవాడే పెన్నిధి అనుకుని వెళ్లిపోయింది” భార్య మాటలు మధ్యలో తుంచేస్తూ అన్నాడు.


శంకరం మాటలు కాస్త నిరుత్సాహం కలిగించాయి పద్మకు. అతని వద్ద నుండి తను ఆశించిన ప్రతిస్పందన అది కాదు. శంకరం అనుభవిస్తున్న మానసిక వ్యథ ఆమెకు తెలుసు. చెల్లెలి పట్ల అతడికి గల అపారమైన ప్రేమ ఎటువంటిదో కూడా తెలుసు. అయితే అతడి మొండి వైఖరి మాత్రం ఆమెకు రుచించడం లేదు. అతడికెదురుగా కూర్చుని శాంత స్వరంతో, “ఎంతైనా మనింటి ఆడపడుచు శాంతి! ఆమె కష్టకాలంలో ఉన్నప్పుడు ఆదుకునే బాధ్యత మనది కాదంటారా?” అంది.

సౌమ్యమైన మాటలతో భర్త మనసు మార్చాలని ఆమె ప్రయత్నం.

భార్య మనసు క్రమక్రమంగా అవగతమవుతోంది శంకరానికి. మౌనంగా భోజనం చేస్తూ భార్య మనసు చదవడానికి ప్రయత్నిస్తున్నాడు. కారు ప్రమాదంలో గాయపడిన శాంతి భర్తకు రెండు రోజులలో శస్త్రచికిత్స జరగబోతోంది. అన్ననూ, వదిననూ రావలసిందిగా అర్థిస్తూ ఉదయం ఫోన్ చేసింది శాంతి. పద్మ వేసిన మొదటి ప్రశ్నకి ఇప్పుడు సమాధానం లభించింది శంకరానికి. ఆ పాతిక వేలూ ఇప్పుడు పోస్టాఫీసులో వేయకుండా హైదరాబాద్ తీసుకుని వెళ్తే ఆపరేషన్ ఖర్చులకి వినియోగించనూవచ్చు, శాంతికి ధైర్యం చెప్పినట్టూ అవుతుంది అనేదే ఆవిడ భావంలా తోచింది శంకరానికి.

“శాంతికెటువంటి ఆర్థిక ఇబ్బందులూ







ఉండవు. ఈ విషయంలో నీవేమీ ఆందోళన చెందనవసరం లేదు. వాళ్లిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు! నెలకి లక్ష రూపాయలకు మించి ఉంటుంది వారిద్దరి జీతం కలిపితే!" శంకరం గొంతు కాస్త కటువుగానే ధ్వనించింది.

"ఈ సమయంలో ఆర్థిక సహాయం మాత్రమే కాదు, మనిషి సహాయం, మాట సహాయం కూడా అవసరం కదండీ! తను ఎంతగానో కలవరపడుతూ ఫోన్ చేసింది" పెరుగు వడ్డిస్తూ అంది పద్మ.

భార్య మాటలు చిరాకు కలిగించినా, ఆడబిడ్డ పైన ఆమెకున్న మమకారం అతణ్ని ఆకట్టుకుంది. అత్తామామల కోసం, ఆడపడుచుల కోసం భర్తలు డబ్బులు ఖర్చుచేస్తే సహించని స్త్రీల గూర్చి విన్నాడు. కానీ ఆడపడుచు కోసం డబ్బు ఖర్చు చెయ్యమని ప్రాధేయపడుతున్న స్త్రీ తన భార్య కావడం అతడికి గర్వకారణమైంది. చెయ్యి కడుక్కుని లేస్తూ సౌమ్యంగానే అన్నాడు.

"శాంతి ఉండేది హైదరాబాదులో! అరణ్యంలో కాదు! నర్సింగ్ హోం వాళ్లే అన్నీ చూసుకుంటారు. అనురాగంతో పెంచిన నీ మనసుని అర్థం చేసుకోగలను. కానీ కన్నతల్లి కంటే మిన్నగా చూసుకున్న నీకు ఆమె మిగిల్చిన గౌరవం ఏమిటి? ఇప్పుడైనా ప్రమాదం సంభవించింది గనుక ఫోన్ చేసింది. లేకుంటే నువ్వూ నేనూ గుర్తుకొచ్చేవాళ్లమా?"

"తను ఇదివరకు రెండు మూడుసార్లు మనతో మాట్లాడాలనే ఫోన్ చేసింది. ఆమె గొంతు విని మీరే లైన్ కట్ చేసేశారు" అతడి వెనుకనే వస్తూ అంది పద్మ.

ఆమె మాటలు విననట్టే మౌనంగా ఉండిపో

యాడు శంకరం.

అతడు ఆఫీస్‌కి బయలుదేరుతూ ఉండగా పాతిక వేలతో ఉన్న జిప్ బేగ్ అందిస్తూ అంది పద్మ.

"మరొక్కసారి ఆలోచించండి. రాత్రి బండికి బయలుదేరితే ఉదయానికల్లా హైదరాబాద్ చేరతాం. తను చేసిన పనిని నేను సమర్థిస్తున్నాననుకోకండి. మనం తప్ప శాంతికి నా అనే వాళ్లెవరున్నారని? కులాంతర వివాహానికి సనాతన సంప్రదాయం గల మనం అంగీకరించమనే భయం వలన ఈ సాహసం చేసి ఉంటుంది. ఈ పరిస్థితులలో దిక్కు తోచక మన సహాయం అర్థిస్తోంది. మనం మరీ బిగుసుకుపోవడం మంచిది కాదని నా ఉద్దేశం..." పద్మ అభ్యర్థనలో ఆడపడుచు పట్ల అభిమానమూ, భర్త ఆగ్రహానికి గురికావల్సి వస్తుందేమోనన్న భయమూ మిళితమై ఉన్నాయి.

ఆమెనోసారి పరిశీలనగా చూసి బేగ్ అందుకుని స్కూటర్ డిక్కీలో పెట్టుకున్నాడు శంకరం.

"ఈ విషయంలో నన్ను నిర్బంధించకు పద్మా, నేను సమాధానపడలేను" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు.

మానవుణ్ని తయారుచేయడానికి భగవంతుడు ఉపయోగించే ముడిసరుకు ఎముకలూ, మాంసమూ అనుకోవడం పొరపాటు! కోపతాపాలూ, రాగద్వేషాలూ, ఖేదమోదాలూ- ఇత్యాది భావోద్రేకాలు మాత్రమే ప్రధానమైన ముడిసరుకేనేమో!

"భగవంతుడా! ఈ అన్నగారి మనసు కరిగించి, ఆ చెల్లెలి కాపురం చల్లగా వర్ధిల్లేటట్టు చేయి" కనిపించని దేవుణ్ని ప్రార్థించింది పద్మ శంకరం వీధి మలుపు తిరిగే వరకూ చూస్తూ.

★ ★ ★

ఆఫీస్‌కెళ్లే ముందు పోస్టాఫీస్‌కి చేరుకున్నాడు శంకరం.

"బాబూ, నాకు కొంచెం సాయం చేస్తారా?"

పోస్టాఫీసులో ఫారాలు నింపుతున్న శంకరం, ఎవరో వెనుక నుండి భుజం తట్టడంతో వెనక్కి తిరిగి చూశాడు. అతడి వెనుక ఒక బిచ్చగాడు నిలబడి ఉన్నాడు!



"ఛ! ఈ బిచ్చగాళ్లు ఆఫీసుల్లోనికి కూడా వచ్చేస్తున్నారేమిటి? ఏవో మాటల్లో పెట్టి ఏమార్చి బేగునో, పర్సునో పట్టుకుని పోయినా పోవచ్చు. బేగులో ఉన్నది వందా రెండు వందలూ కాదు! పాతిక వేలు!! తను జాగ్రత్తగా ఉండాలి" ఆ అగంతకునిపై విసుక్కుని బేగుని దగ్గరగా లాక్కుని ఫారాలు నింపడంలో పడ్డాడు.

"మీ పని అయిపోయాక నాకో చిన్న సహాయం చేసి పెట్టరూ?" అతడు మళ్లీ శంకరం వెన్నుతట్టేడు.

సహనం కోల్పోయాడు శంకరం!

"ఆగవయ్యా! నీ గోల ఏమిటి మధ్యలో? బిచ్చం కోసం ఆఫీసుల్లోకి కూడా చొరబడిపోతున్నారే!?" కాస్త కటువుగా అన్నాడు ఆ బిచ్చగాణ్నుద్దేశించి.

"క్షమించండి. నేను బిచ్చం అడగడం లేదు. గుడ్డివాణ్ని కనుక ఈ మనీ ఆర్డరు ఫారం నింపి పెట్టమని అర్థిస్తున్నాను. అదీ మీ పని అయిన తర్వాతనే!" మనీ ఆర్డరు ఫారం చేత పట్టుకుని అర్థిస్తున్నాడా వ్యక్తి.

నిలువునా కంపించిపోయాడు శంకరం! మానవత్వం మరచి ఒక అంధుడిపైన అనవసరంగా విరుచుకుపడడం ఘోరమైన తప్పిదంగా తోచిందతనికి. అశాంతి, ఆగ్రహం నిండి ఉన్న మనసులో కరుణరసం ప్రవహించింది. గాలి తీసిన బెలూన్‌లా మారిపోయాడు.

"అయ్యో! మిమ్మల్ని పొరపాటుగా అర్థం చేసుకున్నాను. క్షమించండి. ఫారం ఇలా ఇవ్వండి. ముందు మీ పని చేసి పెడతాను" అన్నాడు బాధాతప్త హృదయంతో.

అతడు చెప్పిన చిరునామా రాశాడు ఫారం మీద. యాభై రూపాయలు ఎవరో స్త్రీకి పంపిస్తున్నాడా వ్యక్తి.

"కూపన్‌లో ఏమైనా రాయమంటారా?" ఫారం నింపడం పూర్తయ్యాక అతణ్ని అడిగాడు శంకరం.

"పుట్టినరోజు నాడు పువ్వులూ, గాజులూ కొనుక్కోవలసిందిగా అన్న కోరుతున్నాడని రాయండి బాబూ, చాలు!" వినయంగా అన్నాడు బిచ్చగాడు.

ఈసారి అతడన్న మాటలు విన్నాక వెన్నులో విద్యుత్తు ప్రవహించినట్లయింది శంకరానికి! మూర్తీభవించిన సోదర ప్రేమతో తనకన్నా ఎన్నో రెట్లు గొప్పవాడిగా గోచరమయ్యాడు ఆ బిచ్చగాడు శంకరం కళ్లకు. బిచ్చమెత్తగా వచ్చిన డబ్బు చెల్లెలికి పంపుతున్నాడా వ్యక్తి! అతడి పని పూర్తి చేసి తాను నింపిన డిపాజిట్ అప్లికేషన్ ఫారాలు చించిపారేసి వడివడిగా అడుగులేస్తూ స్కూటర్ స్టాండ్ వైపు నడిచాడు. వెంటనే ఇల్లు చేరుకుని హైదరాబాద్ ప్రయాణమవ్వాలి మరి!

## పేరు సెంటిమెంట్

సినిమా తారలకు పేరు సెంటిమెంట్ బాగా వుంటుంది. మొత్తానికే అసలు పేరుని మార్చేసుకోవడం, వున్న పేరులోనే చిన్న చిన్న మార్పులు చేయడం లాంటివి చేస్తుంటారు. తాజాగా ఇలా తన పేరును కుదించుకుంది మరో తార. ఇంతకాలం కామ్నా జెఠ్మలానీగా చెలామణి అయిన తార ఇప్పుడు తన పేరులోంచి జెఠ్మలానీని కత్తిరించి కేవలం 'కామ్న'గానే మార్చుకుంటే కలిసొస్తుందని ఎవరో చెప్పడంతో అలాగే పాటించాలని నిర్ణయించుకుందిట. మరి ఈ పేరు సెంటిమెంట్ ఎంతవరకూ ఆమెకి కలిసి వస్తుందో చూడాలి.